టెన్త్ విద్యార్థులకు నేటి నుంచి గ్రాండ్ టెస్ట్‌లు

- పబ్లిక్ పరీక్ష తరహాలో రాష్ట్రమంతా ఒకే ప్రశ్నాపత్రం
- ఎస్సీఈఆర్టీ 100 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహణ
- పర్యవేక్షణకు మండలాల పరిధిలో త్రిసభ్య కమిటీ నియామకం



చానమిల్లిలో 100 రోజుల ప్రణాళిక తరగతుల్లో విద్యార్థులు

నిడమర్రు: 2024–25 విద్యా సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు విద్యాశాఖ ప్రకటించిన నూతన కాలనిర్ణయ పట్టిక ప్రకారం 100 రోజుల పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎస్‌సీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ కొనసాగుతోంది. ప్రకటించిన ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ఆయా పాఠశాలల్లో విద్యార్థులను సన్నద్ధం చేసేలా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ వంద రోజుల కార్యాచరణలో భాగంగా ఈనెల 3వ తేదీ, సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాల సీల్ బండిల్స్ ఆదివారం మండల విద్యాశాఖ కార్యాలయాలకు ఇప్పటికే చేరాయి.

పరీక్షల పర్యవేక్షణకు త్రిసభ్య కమిటీ

ఈ గ్రాండ్ టెస్ట్‌లకు అవసరమైన ప్రశ్నా పత్రాలను ఎస్సీఈఆర్టీ సరఫరా చేస్తోంది. ప్రీ పబ్లిక్ మాదిరిగానే రాష్ట్రమంతా ఒకే ప్రశ్నాపత్రం ఉండేలా ఏర్పాట్లు చేసారు. ఈ ప్రశ్నాపత్రాలను ఆయా జిల్లాలోని ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ముద్రించేలా అధికారులు ఏర్పాట్లు చేసారు. ఇప్పటికే ఈ ప్రశ్నాపత్రాల భద్రత, పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు మండలంలోని ఇద్దరు ఎంఈవోలు, క్లస్టర్ స్కూల్ హెడ్మాస్టరుతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందు మాత్రమే పాఠశాలలకు ప్రశ్నపత్రాల బండిళ్లను ఇవ్వనున్నారు. ఎంఈవోలు, సీఆర్‌పీలు తమ పరిధిలోని హైస్కూళ్లను సందర్శించి పరీక్షలను పర్యవేక్షించేలా ఉన్నత అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇటీవల నిర్వహించిన ప్రీ ఫైనల్ పరీక్షల్లో ఎవరు, ఏ సబ్జెక్టులో వెనకబడి ఉన్నారో గుర్తించారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో పది విద్యార్థుల వివరాలు సేకరించిన విద్యాశాఖ అధికారులు వారందరిపైనా ప్రత్యేక దృష్టి పెట్టేలా ఇప్పటికే ఉపాధ్యాయులకు తగిన సూచనలు జారీ చేసారు. ఈ గ్రాండ్ టెస్ట్‌ల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.



గణపవరం ఎంఈవో కార్యాలయానికి చేరుకున్న గ్రాండ్ టెస్ట్‌ల ప్రశ్నాపత్రాలు

గంట ముందు ప్రశ్న పత్రాల పంపిణీ



పది విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళికలో భాగంగా 3 నుంచి 13వ తేదీ వరకూ గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం. పాఠశాలలకు ఆయా తేదీల్లో పరీక్షకు గంట ముందు మాత్రమే ప్రశ్నాపత్రాలు పంపిణీ చేస్తాం. పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం.

– గొర్రెల బాలయ్య, ఎంఈవో–2, గణపవరం

2024-25 టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల వివరాలు

మండలం	జెడ్పీ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ఉంగుటూరు	10	638
నిడమర్రు	07	328
గణపవరం	07	510
భీమడోలు	07	603
మొత్తం	31	2,079

పరీక్షల షెడ్యూల్ ఇలా..

పదో తరగతి విద్యార్థులకు ఈనెల 3వ తేదీ నుంచి గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహించనున్నారు. పరీక్ష ప్రతిరోజు మధ్యాహ్నం 1.30 నుంచి 4.40 వరకూ కొనసాగనుంది. 3న ప్రథమ భాష తెలుగు, కాంపొజిట్ కోర్సు పేపర్–1, 4న హిందీ, 5న ఇంగ్లీషు, 6న ప్రథమ భాష పేపర్–2 (కాంపోజింట్ కోర్సు), ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజీ పేపర్–1, 7న గణితం, 10న ఫిజికల్ సైన్స్, 11న బయాలజికల్ సైన్స్, 12న ఓఎస్ఎస్‌సీ మెయిన్ పేపర్–2, ఎస్ఎస్‌సీ ఒకేషనల్ (థియరీ), 13న సోషల్ పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆర్జేడీలు, డీఈవోలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆదేశించారు.

వీడని బర్డ్‌ఫ్లూ భయం... పెరగని చికెన్ విక్రయాలు



గణపవరంలోని చికెన్ దుకాణంలో విక్రయానికి సిద్ధం చేసిన కోళ్లు

గణపవరం: బర్డ్‌ఫ్లూ భయం ఇంకా ప్రజల మది నుంచి పూర్తిగా తొలగిపోలేదు. ఇంకా చికెన్ అమ్మకాలు నామమాత్రంగానే సాగుతున్నాయి. రెండు వారాలుగా మూత పడిన చికెన్ వ్యాపారం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అయితే ఇంకా పూర్తిగా గాడిన పడటానికి మరో రెండు వారాలు పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు. చికెన్, కోడిగుడ్డు నిర్భయంగా తినవచ్చునని అధికార యంత్రాంగం ప్రకటిస్తున్నా ప్రజలు మరికొంత కాలం చికెన్‌కు దూరంగా ఉంటేనే మంచిదని భావిస్తున్నారు. దీనితో చికెన్ వ్యాపారం ఇంకా కోలుకోలేదు. ఈ రెండు వారాల్లో చికెన్ అమ్మకాలు కేవలం 20 శాతం మాత్రమే పెరిగాయి. మాంసాహార విక్రయాలు జోరుగా సాగే ఆదివారం కూడా గణపవరంలో చికెన్ దుకాణాలు ఖాళీగానే దర్శనమిచ్చాయి. ఆదివారం వందల సంఖ్యలో బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు జరిగేవని, ఈవారం పట్టుమని పది కోళ్లు కూడా విక్రయించలేదని వ్యాపారులు వాపోతున్నారు. ప్రస్తుతం గణపవరంలో కిలో చికెన్ స్కిన్‌లెస్ రూ.200, స్కిన్‌తో రూ.180 చొప్పున విక్రయిస్తున్నారు.

క్లుప్తంగా

ప్రమాదకరంగా అలుగులగూడెం వంతెన



శిథిలావస్థలో అలుగులగూడెం వంతెన

దెందులూరు: సీతంపేట కాలువపై అలుగులగూడెంలో ఉన్న వంతెనపై ప్రమాదం పొంచి ఉంది. సీతంపేట కాలువ పది అడుగుల నీటి ప్రవాహం ఉంది. వంతెనకు ఎడమవైపు సిమెంట్ రక్షణ కంచె ఉంది. కుడివైపు సగంపైగా రక్షణ కంచె విరిగిపోయింది. ఈ వంతనపై గ్రామస్తులు రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సీతంపేట కాలువ ఉధృతంగా ప్రవహించడంతోపాటు, రక్షణ కంచె లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెనకు కుడివైపు రక్షణ గోడ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నత పాఠశాలలో కళావేదిక నిర్మాణం



పాఠశాలలో నిర్మించిన కళావేదిక

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో ఆకుల నరసింహారావు ఉమాలక్ష్మి ట్రస్ట్ కుటుంబ సభ్యులు అందించిన రూ.1.5లక్షలతో కళా వేదికను నిర్మించామని ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరావు, గ్రంథాలయాధికారి గొల్లపూడి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆకుల నరసింహారావు ఉమాలక్ష్మి విద్యాభివృద్ధికి సహకారం అందించేవారని, వారి స్ఫూర్తితో కుటుంబ సభ్యులు ప్రసాద్, శ్రీధర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించడం ఆదర్శనీయమన్నారు.

పశువులకు గాలికుంటు నిర్మూలన టీకాలు

దెందులూరు: గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నామని పోతునూరు పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సీహెచ్ శ్రీరాములు అన్నారు. ఆదివారం పోతునూరు పశువైద్యశాలలో ఆయన సిబ్బందితో కలిసి ఇంటింటా పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజులపాటు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పోతునూరులో 2,200 ఆవులు, గేదెలున్నాయన్నారు. పాడి రైతులు టీకా పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాములు కోరారు.

అభయాంజనేయస్వామికి పూజలు

పెదపాడు: అప్పనవీడులో వేంచేసియున్న అభయాంజనేయస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా అభయాంజనేయస్వామిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు.

శివాలయం వద్ద అన్న సమారాధన

ఉంగుటూరు: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నారాయణపురం శివాలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

ముగిసిన రామకోటి ఉత్సవాలు



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో గత నెల 8వ తేదీ నుంచి జరుగుతున్న 93వ వార్షిక రామకోటి మహోత్సవాలు ఆదివారం నాటితో ముగిశాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రామనామ పారాయణం చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 2 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం 6.30 గంటలకు నగరానికి చెందిన ది వెంకట్రాయ నాట్య శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నాట్యాచారిణి నీలి శర్వాణి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అర్చక స్వాములు దివాకరుని శ్రీ వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి



ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు 37 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకుని సందడి చేశారు. బాల్య స్నేహితులను కలుసుకోవడం మర్చిపోలేని అనుభూతిగా గుర్తుంచుకుంటామని పూర్వ విద్యార్థులు అన్నారు. 1989–90 పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. మృతిచెందిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. అనంతరం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు, పీఏటీ జీ ప్రసాద్‌ను విద్యార్థులు సత్కరించారు. త్వరలోనే దెందులూరు ఉన్నత పాఠశాలకు తమ వంతు ఆర్థిక సహాయం అందిస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు.

నైతిక విలువలతో కూడిన విద్యనందించాలి



సభలో మాట్లాడుతున్న ఎంఈవో నరశింహమూర్తి

పెదవేగి : విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందించాలని పెదవేగి ఎంఈవో ఎస్ నరశింహమూర్తి అన్నారు. పెదవేగి మండలం పినకడిమిలోని ఫాదర్ సిల్వియో పాస్క్వలీ పాఠశాల 30వ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ సిస్టర్ స్వర్ణ ఇన్యాసమ్మ అధ్యక్షత వహించగా, హెచ్‌ఎం సిస్టర్ సరిత ఆధ్వర్యం వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో నరసింహమూర్తి హాజరయ్యారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఏలూరు కథోలిక విచారణ గురువు ఫాదర్ మైఖేల్, దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్, విన్సెంట్ డీపాల్ ప్రిన్సిపాల్ ఫాదర్ రోబిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సర్వేకు ప్రజలు సహకరించాలి



ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: గ్రామాల్లో ఇంటింటా ఆరోగ్య సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నట్టు పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు. నివేదికను వైద్య అధికారికి అందజేస్తామని వారన్నారు. సర్వే చేసిన ఇంటిగుమ్మం వద్ద క్రమ సంఖ్య నమోదు చేస్తున్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు. వైద్య సిబ్బందికి, గృహాల్లో వ్యక్తులు పూర్తిగా సహకరించి అనారోగ్య సమాచారాన్ని తెలియజేయాలన్నారు. అప్పుడే వ్యాధి నిర్ధారణ, నిర్మూలనకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆయన వెంట ఎంపీహెచ్‌ఓ హరి, వైద్య సిబ్బంది ఉన్నారు.

శివాలయంలో కొనసాగుతున్న ఉత్సవాలు

దెందులూరు : చల్ల చింతలపూడిలోని మేధా దక్షిణ మూర్తి శివాలయం ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. తపన సంస్థ అధ్యక్షుడు గారపాటి సీతా రామాంజనేయ చౌదరి శివాలయం ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి శివాలయానికి భక్తులు వచ్చి ప్రదక్షిణలు, అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

విశాఖ వేడుకలకు రంగారావుకు ఆహ్వానం



నటుడు తేరా రంగారావు

పెదవేగి : విశాఖ వేడుకలకు తమ కళాశాల సిబ్బంది ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాల్లో పనిచేస్తున్న ఉద్యోగి తేర రంగారావు సినీ తారల సరసన నటన ప్రదర్శించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈనెల 8న విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ ద్వారకానగర్‌లో నిర్వహించే వేడుకలకు సినీ నట, దర్శక, నిర్మాత అయిన కారెం వినయ్ ప్రకాష్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొని రంగారావు తన నటన ప్రదర్శించబోతున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా రంగారావును ఫాదర్ బాల, ఫాదర్ మోజెస్ సత్కరించి, అభినందించారు.

మహిళల రక్షణకు ప్రాధాన్యత

ఏలూరు టౌన్: ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక శ్రద్ధతో జిల్లాలో మహిళల రక్షణ, భద్రతకు పెద్దపీట వేసినట్లు ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏలూరు అమీనాపేటలోని పోలీస్ కళ్యాణ మండపంలో విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుంటూ మహిళా సాధికారిత, లైంగిక సమానత్వం, మహిళా భద్రత తదితర అంశాలపై సాంస్కృతి, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ మహిళలపై నేరాలను అదుపు చేసేందుకు సత్వర న్యాయం చేసేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఏలూరు మహిళా స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

దాతల సేవలు అభినందనీయం



గుండుగొలనులో దివ్యాంగులకు బియ్యం, పండ్లను అందిస్తున్న దాతలు

భీమడోలు: దివ్యాంగుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తున్న విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. గుండుగొలనులోని విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 66 మంది దివ్యాంగులకు దాతల సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. దాతలు నంబూరి సుబ్బరాజు, అనుసూయమ్మ, హరినాథరాజు దివ్యాంగులకు సన్న బియ్యం, పండ్లను అందించారు. గ్రామంలోని చల్లా నరసింహమూర్తి జ్ఞాపకార్థం వారి కుమార్తెలు సరస్వతి, రాధ, రజిత దివ్యాంగులకు భోజనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శివలంక రామకృష్ణ, పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాసరావు, అరసంకల సోములు, రావి గంగరాజు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగించొద్దు



పోలసానిపల్లిలో దుకాణదారులకు సూచనలందిస్తున్న గ్రామ కార్యదర్శి జయరామకృష్ణ

భీమడోలు: ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఆదివారం గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పోలసానిపల్లిలో గ్రామ కార్యదర్శి షేక్ రహీమాబేగం సూచనల మేరకు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసుల వాడకాన్ని నిషేధించాలని కోరుతూ గ్రామ కార్యదర్శి యు.జయరామకృష్ణ, సిబ్బంది భీమడోలు జంక్షన్, పోలసానిపల్లి ఏరియాల్లోని కూరగాయల దుకాణాలు, చికెన్, మటన్ దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వినియోగాన్ని నివారించాలని, జూట్, గుడ్డ సంచులు వినియోగించాలని దుకాణదారులకు తెలియజేసారు. నిబంధనలు ఉల్లఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భారీగా జరిమానాలు విధిస్తామని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గోవింద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌ల సేవలు ఆదర్శనీయం



విభిన్న అంశాల్లో అవార్డులందుకున్న క్లబ్‌ల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పేదల అభ్యున్నతికై లయన్ అంతర్జాతీయ సంస్థ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని లయన్ రీజియన్ చైర్‌పర్సన్ ఎం.కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం ఏలూరు న్యూ అశోక్ నగర్‌లోని కాకరాల కృష్ణమూర్తి అన్నపూర్ణమ్మ లయన్ మల్టీ సర్వీస్ సెంటర్లో లయన్స్ జిల్లా 316 జి రీజియన్ 1 సేవా మాధుర్యం రీజియన్ సమావేశాన్ని జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు ప్రారంభించారు. సేవా మహోత్సవంలో పేదలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు, విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఈ సమావేశంలో విభిన్న అంశాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డులు అందజేశారు. ఉత్తమ ప్రెసిడెంట్‌గా పీవీ రమణ, ఉత్తమ కార్యదర్శిగా ఎన్‌డీ కృష్ణ, ఉత్తమ కోశాధికారిగా కే. కిషోర్ కుమార్, ఉత్తమ క్లబ్‌గా హేలాపురి లయన్ క్లబ్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా లేళ్ళ వెంకటేశ్వరరావును ×లయన్ ఆఫ్ ది రీజన్ అవార్డుతో, మోస్ట్ ఇన్వాల్వ్‌డ్ లయన్ అవార్డుతో ఎం.శ్రీహరిని అభినందించారు. రీజియన్‌లోని ఏలూరు హేలాపురి లయన్ క్లబ్ ఉత్తమ క్లబ్‌గా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ మల్టీపుల్ జిల్లా 316, 320 లయన్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఏరియా లీడర్ డాక్టర్ అంబటి సుధాకర్ రెడ్డి పాల్గొనగా పీ సుభాష్ బాబు, జిల్లా ప్రథమ వైస్ గవర్నర్ పాపారావు నాయుడు, ద్వితీయ వైస్ గవర్నర్ డాక్టర్ డీ. సుబ్బారావు, జిల్లా పూర్వ గవర్నర్‌లు, ఆహ్వాన సంఘం చైర్ పర్సన్ కేవీ కిషోర్ కుమార్, చీఫ్ అడ్వైజర్ డాక్టర్ వీకే పంకజాక్షన్, పూర్వపు జిల్లా గవర్నర్ వేమా కోటేశ్వరరావు, అడ్వైజర్ కాకరాల రాజేంద్ర వరప్రసాద్, రీజియన్ సెక్రటరీ ఎం.ఉమా కిరణ్ కుమార్, వీ విష్ణుకుమార్, ఎం.వినయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

- శివారు ఆయకట్టుకు చేరని సాగునీరు
- రైతులు, కౌలుదారుల ఆందోళన
- గుర్రపుడెక్క, కర్రనాచు పూర్తిగా తొలగించాలని రైతుల డిమాండ్



కాలువలో తూడు, డెక్కను తొలగిస్తున్న దృశ్యం



పూళ్ల, కైకరం మధ్య పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క

భీమడోలు: గోదావరి కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్న గుర్రపు డెక్క, కర్రనాచులను ఆదివారం తొలగించే పనులను జలవనరుల శాఖ అధికారులు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాలువలో కైకరం నుంచి సత్యనారాయణపురం వరకు కాలువలో దట్టంగా విస్తరించి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న కర్ర నాచు, తూడులను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. కాలువలో జేసీబీలతో పాటు రెండు పడవలతో తొలగించే పనులు పట్టారు. సోమవారం నుంచి మరో నాలుగు పడవలను తీసుకువచ్చి తూడు తొలగించి సాగునీరు కిందికి ప్రవహించేలా అధికారులు చర్యలు చేపట్టామని చెబుతున్నారు. ఈ పనులను ఏఈ సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ గుమస్తా ఆర్‌వీ సత్యనారాయణ, నీటి సంఘాల ప్రతినిధులు పనులను పరిశీలించారు. అదే మాదిరిగా పలు ఛానల్స్‌లో కూలీలతో తూడును తొలగిస్తున్నారు. గుండుగొలను, పాతూరు, పూళ్ల వద్ద పేరుకుపోయిన వాటిని తొలగిస్తున్నారు.

ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో 35 వేల ఎకరాలు

గుండుగొలను సెక్షన్ పరిధిలోని ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో 35వేల ఎకరాల ఆయకట్టుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దాళ్వాలో సాగునీటి సమస్య తలెత్తలేదు. రైతులకు పుష్కలంగా నీరందించారు. గుండుగొలను సెక్షన్ పరిధిలోని పంట పొలాలకు నీరందాలంటే 1100 క్యూసెక్కు నీరు చేరాలి. అయితే ప్రస్తుతం 870 క్యూసెక్కుల నీరు చేరుతోంది. వాస్తవానికి అధికారులు 230 క్యూసెక్కుల నీరు కిందికి విడుదల చేయాల్సి ఉంది. దీనికి తోడు కాలువలో కర్రనాచు, తూడుల వల్ల నీరు శివారు ప్రాంతాలకు చేరకపోవడంతో అక్క డ నీటి మట్టాలు 2.4 అడుగులకు మించి లేదు. పంటల సాగుకు కనీసం 3.5 అడుగుల నీటి మట్టం కావాలని రైతులు అంటున్నారు.

రైతుల ప్రయోజనాలను పట్టించుకోని కూటమి సర్కార్

కూటమి సర్కార్‌లో అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు రైతు ప్రయోజనాలను పట్టించుకున్న పాపాన పోలేదు. కాలువలో పేరుకుపోయిన కర్ర నాచు, గుర్రపు డెక్క, తూడులను తొలగించే పనులపై దృష్టి పెట్టలేదు. దాళ్వా పంట చేతికందే దశలో సాగునీరు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువలో విస్తరించిన కర్ర నాచు వల్ల శివారు ఆయకట్టు పొలాలకు నీరందడం లేదు. నీరంతా పల్లపు ప్రాంతాలకు చేరుతోంది. మెరక తూములకు నీరందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దీనితో సెక్షన్‌కు శివారుగా ఉన్న గుండుగొలను, దెందులూరు మండలాల ఆయకట్టుకు నీరు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చివరిదశలో నీరందకపోతే పెట్టుబడి వృథా అవుతుందని వారన్నారు. మరో రెండు తడులకు పుష్కలంగా నీరందిస్తే పంట చేతి కందుతుందని, లేకుంటే తాలు గింజలు ఏర్పడి నష్టపోతామని రైతులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువలో దట్టంగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న కర్ర నాచు, తూడు, గుర్రపు డెక్కలను తొలగించడంతో పాటు నీటి విడుదలను పెంచాలని రైతులు వేడుకుంటున్నారు.